# అతనికంటె ఘనుడు



"వా..." ఎక్కడో నక్క కూస్తున్నట్టుగా అనిపించడంతో ఫైళ్ళలో మునిగిపోయిన హెడ్‌క్లర్క్ అవధాని చుట్టూ వెతికి కాళ్ళమీద వెచ్చని తడి అనిపిం చడంతో క్రిందకు చూశాడు.

కాళ్ళమీద సాష్టాంగపడి అవకాశం వస్తే వాటిని లాగేయడానికి కూడా వెనుకాడని 'ఉత్తర' కుమారుడిలా విలపిస్తున్న సింహాచలం కనిపించాడతనికి!

కంగారు పడిపోయాడు అవధాని.

"అయ్యయ్యో! ఏమైందయ్యా సింహాచలం?" అన్నాడు చేస్తున్న పని ఆపి సీట్లోంచి లేచి అతని జబ్బ పుచ్చుకుని పైకి లేపుతూ

అతను లేవలేదు సరికదా వాడు అందుకున్న 'వూళ' లాంటి ఏడుపుకి అవధానే క్రింద కూర్చున్నాడు. మగవాళ్ళు అంత ఘోరంగా ఏడుపు అఘోరించగలరని అతనికి అప్పుడే తెలిసింది.

"ఓరి నీ దుంపతెగ! ఏమైందయ్యా? నా కసలే బి.పి. ఏం జరిగిందో చెప్పి ఏడవ్వయ్యా బాబూ!" అన్నాడు అరచేతుల్లో పట్టిన చెమటను తుడుచుకుంటూ!

"బాబుగారూ! నా బిడ్డ... నా బిడ్డ...." ఒక్కసారిగా వాడు బావురుమనేసరికి పై ప్రాణం పైనే పోయినట్టయింది అవధానికి- ఊపిరి గట్టిగా పీల్చి వదులుతూ అడిగాడు.

"నీ బిడ్డ? ఊ చెప్పు! ఏమైంది నీ బిడ్డకి?"

"నా బిడ్డ సావు బతుకుల మధ్య ఉన్నాడు బాబూ. తవరే ఆణ్ణి కాపాడాల. అర్జంటుగా సిలై నెట్టాలంట. అయిదొందలు అవుతుందంట... వా...!" వాడి ఏడుపులు అవధానిలోని 'జాలిగుణానికి' గాలం వేశాయి.

"ఓరి నీ కడుపు బంగారం కానూ. ఏడవకయ్యా బాబూ. నా గుండెల్లో దడ కాళ్ళల్లో కొస్తోంది. నా దగ్గర అంత డబ్బెక్కడిదయ్యా? అసలే నెలాఖరు రోజులు!" తప్పించుకున్నాననుకుంటూనే దొరికిపోయాడు అవధాని!

"అంత డబ్బు కాకుంటే ఎంత ఉంటే అంత సర్దండి బాబూ! అదే మీ బిడ్డయితే ఇట్టాగే వదిలేత్తారా?" వాడు సాగదీసిన విధానానికి అవధాని పూర్తిగా గుమ్మయిపోయాడు.

తుమ్మచెక్కకి ముక్కు పొడుం రంగు పెయింట్ వేసినట్టు మొహమూ వీడూను. సెంటిమెంటు మీద కొట్టాడు వీడి నోరడ! పైగ నా కొడుక్కి శాపనార్థాలు పెడుతున్నాడు వీడి మొహం మండా! అనుకుంటూ పర్సు తీశాడు-అవధాని!

స్ప్రింగులా లేచి కూర్చున్నాడు సింహాచలం! వాడి కళ్ళు జీవకళతో మెరిశాయి.

"పచ్చనోటు! వంద! ఇంద"

అవధాని ఇచ్చాడూ అనే కంటేవాడు లాక్కున్నాడు అంటే బాగుంటుందేమో!

"అయిదవ వంతు బతికించారు బాబూ! మిగతా నాలుగు వందలకి ఎవరిని పట్టుకోవాలో... వా..."

"ఇంక ఆపు! ముందెళ్ళి ఓ బాటిల్ అయినా పెట్టించిరా! ఈలోగా నేను ఎలాగోలా ఆ మిగిలిన డబ్బు పట్టుకొస్తాను." అవధాని కూడా లేచి నిలబడి ఫైళ్ళను సర్దడానికి ఉద్యుక్తుడయ్యాడు.

" ఇంతకీ ఏ హాస్పిటలో చెప్పావు కాదే!" వెళ్ళబోతున్న వాడిని మళ్ళీ తానే అడిగాడు.

"అమ్మ! ఎంతమాట! మీకు అంతటి కట్టం కలిగిత్తానా బాబు! ఆ మిగతా డబ్బు నేనే ఎట్టాగైనా పట్టేయనూ. మీరు నిచ్చింతగా ఉండండి. వత్తాను బాబూ!"

వాడు వెళ్ళే హుషారు చూస్తుంటే మిగతా నాలుగు వందలకీ ఎవడి నెత్తినో చేయి పెట్టేలాగే వుంది అనుకొని కుర్చీలో కూలబడ్డాడు అవధాని!

అప్పుడు గుర్తుకు వచ్చిందతనికి. భార్య వర్ధనమ్మ నెలవారీ కోటా తెమ్మని ఇచ్చిన డబ్బు అది. అతని గుండె గుభేలుమంది.

నెలవారీ కోటా ఇంటికి పట్టుకెళ్ళకపోతే, మొగుడని కూడా ఆలోచించకుండా ఇవ్వాల్సిన "కోటా" ఇచ్చేసే మధ్య తరగతి ఇల్లాలు ఆమె!

స్టాఫ్ అంతా అయిదు గంటలకే ఇళ్ళకు వెళ్ళిపోయారు-వాళ్ళతో బాటే తనూ వెళ్ళిపోయినా బాగుండేది. అయితే...

"ఆ రోజు ఫైళ్ళు పని పూర్తవకపోతే మరునాడు "మెమో" అందుకోవడానికి సిద్ధంగా ఉండు" అన్న చండశాసనం ముండా ఆఫీసర్ అయిన తన బాస్ "పరాంకుశం" గారి హుకుంతో ఆగాల్సి వచ్చింది. ఈ రోజుల్లో మంచి మనసు, జాలిగుండె అస్సలు పనికిరావు అంతా నా ఖర్మ 'శని' గాడిలా తగలబడ్డాడు. "ఒరేయ్ సింహాచలం!" కసిగా పళ్ళు నూరి ఏం చేయాలా అని తల పట్టుకుని కుర్చీలో కూలబడ్డాడు.

-అసలు 'శని' అప్పుడే ప్రారంభం అయిందని తెలియని అవధాని!

★★★

ముప్పై ఏళ్ళ నుంచి మూడు పూటలా భర్తకు వండిపెడుతూ ఏనాడూ అలుపెరుగని యంత్రంలా పనిచేసే వర్ధనమ్మగారు, రెండు రోజులపాటు పెట్టిన గుంటూరు మిరప పళ్ళతో చేసిన కొరివికారం వచ్చడి మెతుకులు, భర్త భోం చేసేంతవరకు దగ్గరే ఉండి తినిపించే సరికి కళ్ళలోని కేశనాళికలు రక్తం చిమ్మేలా ఎరుపెక్కాయి అవధానికి. నెలవారీకోటా యింటికి పట్టుకు వెళ్ళనందుకు ఫలితం అది.

ఆ తరువాత తెలిసింది. వాచ్‌మన్ సింహాచలం గాడు పెద్ద 'డోసు' బాబు అని. సాయంత్రం అయ్యేసరికి పూర్తి కల్లు బాటిల్

కడుపునిండా పడకపోతే వాడు మనిషి కాదు. ఒకవేళ పగలు ఆఫీసు కొస్తే 'పశువు'లాగే ప్రవర్తిస్తాడు. వాడిని 'మార్చే' ఓపిక లేక చండశాసనం ముందా ఆఫీసరే చేతులు దులిపేసుకున్నాడు. నిజానికి వాడి కొడుక్కి ఏ రోగమూ లేదట. ఏమైనా సరే రేపు ఫస్టుకు వాడి దగ్గర నుంచి 'వంద' వసూలు చేసి సగర్వంగా వర్ధనమ్మ గారి ముందు నిలబడాలని నిశ్చయించుకున్నాడు అవధాని.

మరో మూడు రోజుల్లో జీతాలిచ్చారు.

వాచ్‌మెన్‌ని నిలేసి అడిగాడు అవధాని.

"ఈ వేళే కదండీ. జీతాలిచ్చారు! ఒకటో తారీకు ఇంకా ముప్పై రోజులే కదా ఉంట!" అతి తేలికగా అన్నాడు వాడు తల ఎగరేసి.

"అంటే ఇప్పుడు- ఈ జీతంలో ఇవ్వవా?"

వాడు పై నుంచి కిందకి అవధానిని ఒక్కసారి చూశాడు.

"మీరూ ఈ వేళే కదా జీతం పుచ్చుకుంట!"

"అవును! అయితే!"

"మరి నాకిచ్చిన వందతోనే మీ నెల ఖర్చులన్నీ ఆగిపోయినట్టు మాటాడతారేం టండీ" అన్నాడు శూన్యంలోకి చూస్తూ.

"ఒరి నీ దుంపతెగ! నాకా 'వంద' చాలా అవసరం రా!"

"ఏంటండోయ్! ఒరినీ, రా! అంటున్నారు. నేనూ మీ అంతకాకపోయినా మీ ఆఫీసులో పనిచేసే వాచ్‌మన్‌ని అనిమర్చిపోకండి!" చేతులు వెనక్కు పెట్టుకుని నిర్లక్ష్యంగా అన్నాడు ఒక కాలు మీద బరువంతా ఆన్చి నిలబడి, మరోకాలు ఊపుతూ.

నవ్వాలో, ఏడవాలో తెలీలేదు అవధానికి.

"అది కాదోయ్! మా కుర్రాడికి కాలేజీ పరీక్ష ఫీజు కట్టాలి!" నోటికొచ్చిన అబద్ధం చెప్పాడు. "చాల్లేండి ఎందుకొచ్చిన అబద్ధాలు? పరీక్ష ఫీజు ఏ నెలలో కడతారో ఆ మాత్రం నాకు తెలీదనుకుంటున్నారా! అయినా ఏ ముహూర్తాన ఏడుతన్నా ఇచ్చారోగాని ఆ రోజు 'సీసా' అసలు' కిక్కే ఇవ్వలేదు బాబూ! అన్నీ నీళ్ళు కలిపి సచ్చారు! ఏదీ! ఓ వంద ఉంటే ఇలా పడేయండి. ఏకంగా రెండువందలూ కలిపి రేపు ఫస్టుకి జీతంలో ఇచ్చేస్తా!" అన్నాడు సింహాచలం.

"మర్యాదగా మాట్లాడు. నువు వచ్చి ఏడిస్తే కదరా, నేను ఏడుస్తూ ఇచ్చాను. ఇంక పైసా ఇవ్వనుగాక ఇవ్వను. ముందు మర్యాదగా నా 'వంద' నాకు ఇవ్వు! లేకపోతేనా?....."

అవధాని కళ్ళకు వర్ధనమ్మ గారి ఉగ్రరూపం కలకత్తా కాళి నాలికలా భయంకరంగా కనిపిస్తోంది.

"ఏం చేత్తారంటి! ఆ! నాకు తెలీకడుగుతా! ఏం చేత్తారంట! అయినా మీరు నాకిచ్చినట్టు సాచ్చెం ఏదండి? అపుడు ఆఫీసులో ఎవరూ లేరే? మీరు యిపుడు ఒక్క పైసాకూడా ఇయ్యనంటున్నారు కాబట్టి నేను కూడా చెబుతున్నా వినండి! మీ వంద ఇవ్వను గాక ఇవ్వను! మీ దిక్కున్నచోట

చెప్పుకోండి!"

"ఏం! బెదిరిస్తున్నావా? అందరికీ చెప్పి నీ పరువు గంగలో కలిసేలా చేయకపోతే నా పేరు అవధానే కాదు!"

"ఏంటి? నిజమే? అందరితో చెప్పి నా పరువు గంగలో కలుపుతారా? అసలు నాకు పరువెక్కడిది బాబూ! అదే ఉంటే ఇలా మీకాడ, మీకాడ అడుక్కోవాల్సిన అవసరం నాకేటండీ! ఆ 'పరువు'ని ఏ డబ్బున్న వాడికో తాకట్టు పెట్టి "లంబాడోళ్ళ రాందాసులా బతికేద్దును. అంచేత మీరు నిశ్చింతగా మీ పనిమీద ఉండండి! నా పనిమీద నే ఉంటా! వత్తా!"

వాడు వెళ్ళిపోయాడు.

అవధాని తాలూకు "శని" తృతీయ అంకంలోకి అడుగుపెట్టింది. ఎలాగంటే...

★★★

మొత్తం ఆఫీసులో స్టాఫ్ అందరికీ వాచ్‌మెన్ సింహాచలం సంగతి పూసగుచ్చినట్టు వాళ్ళ బుర్రలు తినేస్తూ చెప్పాడు అవధాని.

అంతా పూర్తయిన తరువాత అందరూ తలోమాటగా అన్నారు!

"అందుకే నండీ! వేం ఆఫీసుకు ఎప్పుడూ జేబులో పైసా లేకుండా వస్తాం! ఆఫీసయ్యాక శ్రమ అయినా సరే ఇంటికి వెళ్ళాక బజారు పని చూసుకుంటాం".

"ఏ ఈశ్వరుడైనా వదులు తాడేమోగాని, ఆ సింహాచలంగాడు పట్టుకుంటే వదలడు. వాడు ఒకవేళ వదిలేస్తే 'శని సింగనాపూర్' వెళ్ళి అభిషేకం చేసినంత ఫలితం పొందినట్టే!"

"అయినా ఇచ్చేటప్పుడు మాకు చెప్పి ఇచ్చావా? మేం వసూ[illegible]సేసి పెట్టడానికి!"

అవధాని కూడా వదిలేద్దా[illegible]ను కున్నాడు.

వారం రోజుల తరువాత -

ఓ రోజు ఉదయం - పదకొండుగంటల సమయంలో కాకీ నిక్కర్లు కట్టుకున్న ఓ పదిమంది నా[illegible] లక్షణాలు ఉట్టిపడుతున్న వ్యక్తులు బిలబిలా, అటెండర్ అడ్డు వచ్చినా తోసేసి ఆఫీసర్ గారి ఛాంబర్‌లోకి వెళ్ళారు.

మరో రెండు నిమిషాలలో అవధాని గారికి పిలుపు వచ్చింది! బిక్కుబిక్కుమంటూ లోపలికి వెళ్ళాడు అవధాని.

ఏ ఫైలు సక్రమంగా పూర్తి చేయలేదో వీళ్ళంతా వచ్చి మీద పడ్డారు అనుకుంటూ!

డోర్ తెరచుకు అడుగు పెడుతూంటేనే ఎడమకన్ను అదరడం, నక్కవూళ వినిపించడం జరగడమే కాదు.

ఆఫీసర్‌గారి కొత్త బూట్లు తడిపేస్తూ "సింహాచలం" ఆయన పాదాల దగ్గర కనిపించాడు కూడా.

"అమ్మ దొంగ వెధవా! అయిపోయాను!" అనుకూంటూ ఓ ప్రక్క నిలబడ్డాడతను ముఖాన నెత్తురు చుక్క లేకుండా.

వచ్చిన వారిలో రాజకీయ నాయకుడి లక్షణాలు పరిపూర్ణంగా మేళవించిన అతను అంటున్నాడు- ఆఫీసర్ గారితో...

"మీకేం తెలుసు బాబూ! ఇచ్చిందేమో

బోడి 'వంద!' అదీ ఆడి కొడుకు చావు బతుకుల మధ్య ఉండి కాళ్ళావేళ్ళా పడి బతిమాలితే ఇచ్చింది. ఆ మాత్రానికే కనిపించిన ప్రతీవాడికీ 'సింహాచలం నా దగ్గర వంద తీసుకొన్నాడు. అడిగితే నీ దిక్కున్నచోట చెప్పుకో పో! అన్నాడ'ని చెబుతాడా. ఆ మాట కూడా ఆడు అనలేదంట బాబు! ఒకవేళ అంటే మాత్రం అందరితోటీ చెప్పేయడమే? మాకు మాత్రం పరువు లేదనుకున్నాడా? అక్కడకీ ఈడు 'ఇబ్బందుల్లో ఉన్నాను ఈ నెలకి ఇవ్వలేను బాబు గారూ!' అన్నాడంట. వినిపించుకుంటేనా!

'నా వంద నాకివ్వకపోతే నీ అంతు తేలుస్తాను! బజారులో పబ్లిగ్గా మీటింగ్ పెట్టి అరుస్తాను. ఏం చేస్తావో చేసుకో' అంటాడా. అంతెందుకు బాబు. మాలో ఒక్కడితోపెట్టుకుంటే చాలు. తిట్టిన తిట్టు తిట్టకుండా ఆయన పది తరాలకు సరిపడా మేమూ తిట్టగలం. వాడు రెండు రోజులు నుంచి ఒక్కగుక్క కూడా తాగలేదు! వెర్రి సన్నాసి! మీరీ విషయంలో చర్య తీసుకుంటేనే గాని మేం వెళ్ళం! మీరు కూడా ఎటూ తేల్చకపోతే మా పట్టణ వాచ్‌మన్‌ల సంఘం మీ ఆఫీసులో ముందు ధర్నా చేసి చూపిస్తాం" అని అధికారికంగా ఓ వినతిపత్రం సమర్పించాడతను.

ఆఫీసర్‌గారి ముఖం చిక్కని చీమూ నెత్తురు నిండి ఏ క్షణాన్నైనా పగిలేగడ్డ కురుపులా ఉంది.

నిలువునా కాల్చేసేలా అవధానిని చూస్తూ ఉరిమినట్టుగా అన్నాడు.

"ఇలా రావయ్యా! దగ్గరగా తగలడు. విన్నావా 'ఆయన' మాటలు? నాకున్న సమస్యల్లో మళ్ళీ ఇదొకటా. నీ కస్సలు బుద్ధుందీ? కష్టాల్లో ఉన్న ఎదుటి మనిషికి చేతనైనంత సాయం చేయడంపోయి పదిమందిలోను సాటి ఉద్యోగస్థుడి పరువు తీస్తావా. ఇలాంటి తప్పుడు పని మరోసారి చేశావో ట్రాన్స్‌ఫర్‌కి రికమెండేషన్ చేస్తాను జాగ్రత్త! పైగా యూనియన్ వాళ్ళతోనా పెట్టుకోవడం. బుద్ధి లేదటయ్యా!" అని అవధానిని తీవ్రంగా మందలించి-

"బాబూ! -ఆయన మరోసారి ఇలాంటి తప్పు చెయ్యకుండా మందలిస్తాను. సరేనా మీరు వెళ్ళి రండి. అయినా ఏమయ్యా సింహాచలం! ఇలాంటిదేమన్నా జరిగితే నా నోటీసులోనికి తీసుకురావాలిగాని కుటుంబం లాంటి మన ఆఫీసు పరువు రచ్చకీడ్చు కుంటారటయ్యా. నాయనా! మీ వాడికి న్యాయం జరిగేలా చూసే పూచీ నాది! మీరు వెళ్ళిరండి బాబూ! మీరు వెళ్ళిరండి."

ఆయన మందలింపుకీ, అనునయ వాక్యాలకి సంతృప్తి చెందినవాళ్లు "పట్టణ వాచ్‌మన్స్ సంఘం జిందాబాద్" అనే నినాదాలతో ఆఫీసు దద్దరిల్లగొడుతూ అవధానిని తినేసేలా చూస్తూ ఒక్కొక్కరే బయటకు వెళ్ళిపోయారు.

వాళ్ళ వెనుకే తుండుగుడ్డ అవధాని మొహం మీద దులిపి తలకు చుట్టుకుంటూ

అనుసరించారు వాచ్‌మెన్ సింహాచలం గారు కూడా.

వాడి వెనుకే ధడేల్‌మని డోర్ మూసుకు పోయింది.

అంతే!

అవధాని ఒక్కసారిగా "పరాంకుశం" గారి కాళ్ళమీద పడిపోయాడు. ఆయన చటుక్కున కాళ్ళు వెనక్కు తీసుకున్నారు.

"ఇప్పటిదాకా వాడి చొంగతోటి, ఏడుపు తోటి నా బూట్లు, సాక్స్ నానిపోయాయి ఇప్పుడు నీ వంతా నాయనా" అంటూ అవధాని రెండు భుజాలు పట్టి పైకిలేపారు.

అవధాని ఊహించనంతగా అతన్ని ఒక్కసారిగా వాటేసుకుని బావురు మన్నాడాయన!

ఈసారి అవధాని బిత్తరపోయాడు!

"సార్ ఏమిటీ పని?" విస్తుబోతూ అడిగాడు.

ఆయన అతికష్టం మీద దుఃఖం ఆపుకుని కళ్ళజోడు తీసి తుడుచుకుని వాచ్‌మెన్స్ యూనియన్ ప్రెసిడెంట్ ఇచ్చిన లెటర్ హెడ్ కాగితం అవధాని చేతికి అందించాడు.

అందులో ఇలా ఉంది!

"అయ్యా! ఇది వరలో మీరు చేసిన అదే తప్పు మీ ఆఫీసులో ఒక హెడ్‌క్లర్క్ చేయడం మాకు చాలా వింతగా ఉంది. అందులో మీ హస్తం వుందని మా అనుమానం. ఇదివరలో మిమ్మల్ని కేవలం హెచ్చరించి వదిలేశాం. ఈసారి వ్రాత పూర్వకంగా హెచ్చరిస్తున్నాం! మరోసారి మా సభ్యుడు సింహాచలాన్ని మీరు గాని, మీ ఆఫీసుసిబ్బందిగాని అన్యాయంగా, అక్రమంగా మానసిక క్షోభకు గురిచేస్తే ఎటువంటి నోటీసు తమకు ముందుగా ఇవ్వకుండానే తమ ఆఫీసు ముందు ధర్నా చేయగలమని హెచ్చరిస్తున్నాము".

అవధాని దాన్ని బల్లమీద పెట్టి జరిగినదంతా ఆఫీసరు గారికి పూస గుచ్చినట్టు చెప్పి బావురుమన్నాడు.

దానికి ఆయన విరక్తిగా నవ్వాడు.

"పిచ్చివాడా! నువు పదిరోజుల నుంచే పచ్చడి మెతుకులు తింటున్నావు! నేను వాడికి అయిదు వందలు జాలిపడి ఇచ్చినందుకు గాను అచ్చం నీలాగే అల్లరి పడి రెండేళ్ళ నుంచీ పచ్చడి మెతుకులు తింటున్నాను- అంటే నువ్వు నమ్మతావటయ్యా!" అంటూ తల పట్టుకుని కుర్చీలో కూలబడ్డాడాయన!

అంతటి దుఃఖంలోనూ తన భార్య ట్రైనింగ్ పొందింది తన ఆఫీసర్ గారి భార్యనుండే అని తెలియని అవధాని తనకో 'తోడు' దొరికినందుకు లోలోపల నుంచి రాబోతున్న నవ్వును బలవంతంగా ఆపుకొంటూ తేలికగా ఊపిరి పీల్చుకొన్నాడు గుండెల నిండా!!

●

'ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక'
21-01-2000